(7)

# రేపటి బ్రతుకులు

"జీతం ఇవ్వాళయినా ఇస్తారా?" అన్నాడు, మధుసూదనరావు మెల్లగా ఆచారితో.

"మధూ; నన్నా నీ వడిగేది ? నీకంటే నా కెక్కువ తెలుసా ఏమిటి! దురైస్వామిని క్యాషియర్ దగ్గరకు పంపించు" అన్నాడు ఆచారి ఇంతెత్తు ఫైల్సు మధ్యనుంచి.

మధుసూదనరావు దురైస్వామిని పిలిచాడు.

'దురైస్వామీ ! మన సెక్షనుకు జీతాలు ఇవ్వాళయినా ఇస్తారేమో కాస్త కనుక్కొస్తావూ?"

"ఈవాళ ఆఫీసు తెరిచాక మూడుసార్లు వెళ్ళాను సార్!...జీతాలు ఇవ్వాళకూడా యివ్వరట. నాకు నిండా కష్టంగావుంది సార్" అన్నాడు దురైస్వామి అటూ ఇటూ చూస్తూ.

"నెమ్మదిగా మాట్లాడు—ప్రక్కగదిలో మేనేజరుగారున్నారేమో."

"ఎందుకండీ భయం. పని చేస్తున్నాం జీతం పుచ్చుకుంటున్నాం. మనకు మేనేజరుగారు ధర్మంగాఇవ్వటంలేదు— అన్ని సెక్షన్లవాళ్ళకూ జీతాలు నిన్ననే ఇచ్చారు— నిజం చెప్పమంటే చెబుతాను—మాఇంట్లో పిల్లిలేచి నాలుగు రోజులయింది. ఇవ్వాళ నాలుగో తారీకు, అయినా జీతం చేతికి రాలేదు."

"మేమే నానా ఇబ్బందులు పడుతున్నాం; ఇరవయ్ ఎనిమిది రూపాయలు సంపాయించే నీ విషయం వేరేచెప్పాలా? సరేగాని—మేనేజరుగారు గదిలో లేరా?"

"ఇంకా రాలేదు...ఒంటిగంటకు వస్తారు. రావటంతోటే గంట మోగిస్తారు."

దురైస్వామి వెళ్ళిపోయాడు.

"చూచావా ఆచారీ! దురైస్వామి ఎంత ఆవేశంతో వున్నాడో. కాని ఏం లాభం! పేదవాడి ఆవేశం వాడి కొంపకే చేటు. ఎంతో బాధపడుతుంటే గాని అత నలా మాట్లాడివుండడు" అన్నాడు మధుసూదనరావు.

"నిజమే. బీదవాడు దుఃఖాల్ని దిగమింగుకోవాలి. అభిలాషల్ని, అభిప్రాయాల్ని అంతర్యంలోనే అణచుకోవాలి. వాడికి నాలుగువేపులా అంధకారం అలుముకొనివుంది. అది ఎప్పటికీ తొలగిపోదు—వాడు బాధలు పడి పడి దిక్కులేని చావుకు లోనుకావాల్సిందే," అన్నాడు ఆచారి.

ఆచారి మాటలకు మధుసూదనరావుహృదయం అమిత బాధకు లోనయింది. "ఆచారి తనకంటే లోకాన్ని బాగా అర్థం చేసుకున్నమనిషి. ఈ ఆఫీసులో నాలుగు సంవత్సరాలనుంచి పనిచేస్తున్నాడు. జీతం డెబ్బై ఎనిమిది రూపాయలు. ముగ్గురు పిల్లలు. తనో? సంవత్సరం క్రితం చేరాడు—అరవయ్ఐదు రూపాయల జీతం. పెళ్ళాం, తనూ జీవించాలి. బాధలు అందరికీ ఉన్నాయి. అయితే ఆచారి జీవితాన్ని నిరాశామయంగా చిత్రించటం తనకు నచ్చలేదు.

"ఈ విచ్చులుకున్న అంధకారపు తెరలు ఎప్పటికీ ఇలా వుండవు—అవి తొలగిపోతాయి. బీదవాళ్ళ నిరాశల ధాటికి ఈ ప్రపంచం ప్రకంపిస్తున్నది. నవజీవనం కుసుమిస్తుంది. మన రేపటి బ్రతుకులలో కాంతి విరజిమ్ముకుంటుంది. నిరాశను దరిజేర్చుకోవటం తగదు భాయీ!" అనిచెప్పేందుకు మాటల్ని కూర్చుకునేలోపే మేనేజరు రావటం, గంటకొట్టడం జరిగి పోయింది.

ఆచారి ఎర్ర లేబిల్ తగిలించి ఫైల్ దురైస్వామి చేతి కిచ్చి మేనేజరుగదిలోకి పంపించాడు. మధుసూదనరావు హృదయంలో ఇంతకు క్రితం ఉద్భవించిన భావాలు—మాటి మాటికీ పైకుబుకుతున్నాయి. మధుసూదనరావు మేనేజరు సంతకం జేసి పంపిన డ్రాఫ్టును టైప్ చెయ్యటానికి—యంత్రా న్ని సరిజేశాడు. అయితే అతని మానసికయంత్రం మాత్రం దానికి సంసిద్ధంగాలేదు. అతని మానసపటలంమీద ఎన్నె న్నో బావనలు ప్రకటితం కాజొచ్చాయి...

మద్రాసులో ఉద్యోగం దొరకటం చాలా తేలికని ఎవరో చెప్పగా మధుసూదనరావు ఇక్కడికి పరుగెత్తు కొచ్చాడు! ఒక మిత్రుడిగదిలో మకాం! "బాటా" బూట్లు మద్రాసు అందమైన తారురోడ్లమీద అరిగిపోయాయి. కాని తనకు ఒకమాత్రాన ఏదో ఒకఉద్యోగమంటూదొరికిందికాదు. ఎలాగో ఆఖరుకు అరవయ్ అయిదు రూపాయల ఉద్యోగం దొరికేటప్పటికి తలప్రాణం తోకకొచ్చినంత పనయింది.

రెండోనెల తిరక్కముందే భార్యను పిలిపించుకున్నాడు. మూడోనెలలో జీతం చాలక నానాయాతనలుపడి భార్యవంటి

మీదవున్న ఒకటి, రెండు నగ లమ్ముకొని గడుపుకున్నారు. ఆ తరువాతనుంచీ కొన్నిరోజులు తింటే, మరికొన్నిరోజులు తిన కుండా జీవితాన్ని నెట్టుకెళ్తున్నారు. ఇప్పుడు మధుసూదన రావు భార్య గర్భవతి!

ఆ మేనేజరు గదిలోంచి గంట వినిపించింది. అప్పుడు మధుసూదనరావు మామూలు ప్రపంచంలోకి వచ్చాడు. ఆ మరు నిమిషంలో దురైస్వామి వచ్చి టైపుచేసిన కాగితం మేనేజరుగారు అడుగుతున్నారని చెప్పాడు. మధుసూదనరావు దాన్ని అప్పుడే ప్రారంభించాడు. "ఇప్పుడే ఇస్తా; అయిపో యింది; ఒక్క నిమిషం ఆగు" మధుసూదనరావు తొట్రు పడ్డాడు...కాని టైప్‌యంత్రం అన్నీ తప్పుల్ని టైప్ చేస్తోంది. రెండుమార్లు ఇలా జరిగింది. మూడో పర్యాయం మరల కాగితం యంత్రంలో అమరుస్తున్న సమయాన్నే లోపల్నుంచి గంట విన్పించింది. దురైస్వామి లోనికెళ్లాడు,

మధుసూదనరావును మేనేజరు లోనికిపిలిచి...ఆ అవ సరమైన కాగితాలు త్వరగా టైపుచేయని కారణా లడుగుతూ ఏవో మాటలంటున్నాడు, బిగ్గరగా. ఆచారి విని వూరుకు న్నాడు. అంతకంటే ఏం చేయగలడు గనుక?

లంచ్ టైంలో అంతా బయటి కెళ్ళారు. ఆఖరుకు ఆచారికూడా సీటులో లేడు. మధుసూదనరావుకు ఆకలేస్తు న్నది. కాని జేబుఖాళీ! టీ తాగటానికేనా అణాన్నర లేదు. రేపుకోసం ఎదురు చూస్తున్నాడు! కాని రేపు తనకు లభించ బోయే జీతంలో-బాకీలు తీర్చగా మిగిలేది చాలా తక్కువని తనకు తెలుసు. జీతం పుచ్చుకున్న మరురోజు మరల జేబు

ఖాళీ! మరల అప్పుకోసం బయలుదేరాలి! వాస్తవం మాట్లాడాలంటే...ఇలాంటి మనుషులు జీతం పుచ్చుకున్న రోజున జన్మించి ఆ రెండో రోజే చచ్చిపోతారు! అప్పుజేసి జీవితం గడుపుకోటం చచ్చిపోయినదాంట్లోనే జమ అవుతుంది గనుక!

మధుసూదనరావు లేచి నిల్చున్నాడు. "ఘుమఘుమలాడే కాఫీ వుంటే ఎంత బాగావుంటుంది" అని అనుకున్నాడు. గబగబా క్రిందికి దిగి ఎవరినీ చూడకుండా ఆఫీసు వెనకవేపున వున్న కార్పొరేషన్ పంపులో గటగటా రెండు చెంబుల నీళ్ళు తాగేశాడు మధుసూదనరావు! మూతి తుడుచుకొని ఎవరేనా చూస్తారేమోనని ప్రక్కకు తప్పుకున్నాడు. ఆచారి అక్కడే నిల్చొని ఏదో ఆలోచిస్తున్నాడు! బహుశా ఆచారికూడా పంపులో నీళ్ళు తాగి అటువేపుకు వెళ్ళి వుంటాడు! ఆచారిని చూట్టంతోనే మధుసూదనరా వన్నాడు—"నువ్వూ ఇక్కడే వున్నావా? నీకోసమే వెదుకుతున్నా! మన ఉభయుల గమ్యస్థానాలు ఒకటే అయ్యాయి!"

"సరే! మనం మనం కలవకపోతే డబ్బున్నవాళ్ళంతా మనతో కలుస్తారా? అవునుగాని... మేనేజరు ఏమంటాడు?"

"ఏమీలేదు, పనిచేయటం ఇష్టం లేకపోతే రిజైన్ చేయమంటున్నాడు. ఏదో ప్రాధేయపడ్డాను."

"ఇలా వున్నాయి మన బ్రతుకులు! అడుగడుక్కీ గండాలే! మన లోపల నిప్పువంటి ఆకలి ప్రజ్వరిల్లుతోంది. నరనరంలో నిరాశ, నిస్పృహలు కూరుకుపోయాయి! "రేపు' లేని "రేపుల" కోసం ఈరోజున మనం ఆకలికి కనలి

కనలిపోతున్నాం! బతకడం కోసం రాత్రిం బవళ్ళు గతుకుల దారుల్లో కాళ్ళరిగేట్టు స్వారీ చేస్తున్నాం!..."

మధుసూదనరావు ఆచారి మాటలు వినలేకపోయాడు. ఇలా అన్నాడు "నువ్వు అనవసరంగా పిరికివాడివయిపోతు న్నావు! కలకాలం ఈ వ్యవస్థ ఇలాగే సాగుతుందని నీ భ్రమ! అలా జరగదు బ్రదర్! మన దుఃఖగాథలకు భరతవాక్యం విన్పిస్తుంది. మన యాగం ఫలిస్తుంది!

లంచ్ టైం అయిపోయింది. ఉభయులూ మళ్ళా ఆఫీసుకు వచ్చారు. మధుసూదనరావు కుర్చీలో కూచుంటూనే ఏదో అకస్మాత్తుగా గుర్తుకొచ్చినట్లు మొహంపెట్టి ఆచారితో అన్నాడు— "నా భార్య గర్భవతి! ఇంకోవారంలో ప్రస విస్తుందనుకుంటా. ఈ నెల్లో అదనంగా డబ్బు కావాల్సి వుంటుంది."

"ఆఫీసరుకు అర్జీ పెట్టుకో అప్పుకు" అన్నాడు ఆచారి.

మధుసూదనరావు ఆప్రకారంగానే అర్జీ రాసి దురై స్వామిద్వారా లోనికి పంపించాడు. అలాంటి స్థితిలో వుండి కూడా మధుసూదనరావు తనకు కలుగబోయే సంతానాన్ని ఊహించుకొని మురిసిపోతున్నాడు. ఏవో కలలు కంటున్నట్టు కన్పించాడు. ఏవో వూహాలు అతనిలో గుర్రా ల్లాగా ఎగిరిపోతున్నట్లు వాలకాన్ని బట్టి స్పష్టమవుతోంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అన్నాడు ఆచారి.

మధుసూదనరావు వూహాజగత్తునుంచి వాస్తవిక ప్రపంచంలోకి వచ్చిరావటంతోనే సిగ్గుపడ్డాడు.

ఆచారికి అసలు విషయం తెలిసిపోయింది. ముగ్గురు బిడ్డల తండ్రి గనుక అతని పరవశత్వంలో పాలు పంచుకోలేక పోయాడు !

ఆ సాయంత్రం మధుసూదనరావు ఆఫీసువదలగానే పాండీబజారువేపుకు బయలుదేరాడు. దహించుకుపోతున్న ఆకలికి ప్రత్యామ్నాయంగా ... కార్పొరేషన్ పంపునీళ్లు తాగేడు. నీళ్ళు తాగి మూతి తుడుచుకుంటూ అనుకున్నాడు ...ఇలా ఉపవాసాలుండి తాగగలిగినన్ని నీళ్లు తాగటం అజీర్ణరోగానికి ఉపశమనమని డాక్టర్లు చెపుతారు. అన్ని వ్యాధులకూ మూలకారణంకూడా ఇదేనట ! అయితే దీనికంటేకూడా అపాయకరమైన జబ్బు బీదతనమని ఏ డాక్టరూ చెప్పడు !

మధుసూదనరావు పాతిక రూపాయలు అప్పుగా ఇప్పించవలసిందని ఆఫీసరుకు అర్జీ పెట్టుకున్నాడు. ఆ డబ్బును ఎలా ఖర్చుపెట్టాలో మధుసూదనరావు లెక్కలు తయారుచేస్తున్నాడు ! పాతిక రూపాయల్లో సగానికి పైగా తన భార్య ఆరోగ్యంకోసం — బలవర్ధకమైన ఔషధాలూ, పాలూ పండ్లూ కొనడానికి వెచ్చించాలి. మిగిలినడబ్బు తన క్రొత్త పాపాయి పోషణ నిమిత్తం ఖర్చుచేయాలి.

పాండీబజారు దగ్గరించింది. బజారంతా కోలాహలంగా వుంది. తనొక్కడు మినహా అంతా సుఖంగా వున్నట్టు అతనికి గోచరించింది. రోడ్డుకు రెండువేపులావున్న హోటళ్ళనుంచి ఏవో వాసనలు ఘుమఘుమలాడుతున్నాయి జనం లోపలికెళ్ళి తిని త్రేపుతూ బయటికొస్తున్నారు. ఆడవాళ్లూ, మగవాళ్ళూ

షాపింగ్ పూర్తిచేసుకొని కొందరు స్వంత కార్లలో వెళ్ళి పోతున్నారు; మరికొందరు బస్సులకోసం నిలుచున్నారు.

మధుసూదనరావుకు విచారంవేసింది- అలా షాపింగ్ పూర్తిచేసుకొని వెళ్లేవాళ్ళనుచూచి. ఎదురుగా దుకాణాల్లో మెరుస్తూ కన్పించే గుడ్డల్నిచూచి. తనకు అవసరంగావున్న వస్తువులే ఇతరులకు అతి సునాయాసంగా లభ్యమౌతున్నాయి. మధుసూదనరావు తన వేషాన్ని తానే చూచుకున్నాడు. గుడ్డలు చిరిగిపోయాయి. రెండుజతలతో గడుపుకొస్తున్నాడు. తన భార్యవిషయం వేరే చెప్పాలా? మూణ్నెల్లనుంచి చెబుతూ వస్తున్నాడు--వచ్చే నెల్లో ఒక చీరయినా తప్పక కొంటానని. కాని కొనలేకపోయాడు.

మధుసూదనరావు ఫుట్‌పాత్ మీద నిల్చొని ఆలోచనల్లో నిమగ్నమైపోయాడు '...ఏదో ఒకరోజున తను మంచి రోజులు చూస్తాడు... పదవిలో ఉన్నతి కన్పించవచ్చు. జీతంలో కూడా తగిన మార్పు ఉండకపోదు. అప్పుడు ప్రస్తుతం గాలీ, వెలుతురూ లేకుండా మురికి కాలువలపక్క- నివసించే గది వదిలేయవచ్చు.'

"బాబూ! ఆకలిగావుంది, ఒక కానీ ఇప్పించండి బాబూ!" అనే మాటలు విన్పించటంతో మధుసూదనరావు ఆలోచనలు కదలిపోయాయి. మళ్ళా కుర్రాడుప్రాధేయపడ్డాడు మధుసూదనరావు జాలి నేత్రాలతో చూచాడు. అంతే. కుర్రాడు పక్క-నే విలువగల దుస్తులు ధరించిన వ్యక్తుల సమీపంలోకి వెళ్ళి అదేవిధంగా ప్రార్థించాడు... వాళ్లు వాణ్ని కసురుకున్నారు. ఒకాయన వాణ్ని ఉద్దేశించి అంటున్నాడు-

5052



"శ్రమపడి పనిచేసుకోరా! పనిచేసుకో!!" అని, ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు. మధుసూదనరావు అక్కడ నిల్చున్నవాళ్ళ వేపూ, దిగులుగా తిరిగిపోయే బిచ్చగాడి వేపూ తదేకంగా చూచాడు. మరల ఏవో ఆలోచనలు అతనిలో ఉబికాయి. "ఇలాంటి వాళ్ళంతా ఇతరుల్ని శ్రమపడమంటారు అందరూ శ్రమపడి పనిచేస్తున్నారా. శ్రమపడి పనిచేసేవాళ్ళకు-వాళ్ళ శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తున్నదా! నేను ఉదయం పది గంటలనుంచి సాయంత్రం ఐదుదాకా టైప్‌యంత్రంతో పోటీ పడి శ్రమపడతాను. కాని నాకు లభించేది చాలీచాలని జీతమే. జీతం చాలదంటే ఇంకా శ్రమించమంటారు. శ్రమించినదానికి ప్రతిఫలం ఇవ్వబోతూ బేరాలాడతారు. నీ జీవితాని కింతే విలువంటారు."

మధుసూదనరావు అక్కడ నిల్చోలేకపోయాడు. పాత మాంబళంలోవున్న తనఇంటికి కాళ్ళీడ్చుకుంటూ నడిచి వెళ్ళాడు.

మధుసూదనరావువుండే ఇంటికి ఎలక్ట్రిసిటీ లేదు. కిరసనాయిలు లైటుతో కాలం గడుపుతున్నారు. ఒకే ఒకగది. ఆగదిలోనే వంట. అక్కడే పడక. అదే డ్రాయింగ్‌రూం— అన్నీ అదే! "నువ్విక్కడ ఎలా వుంటున్నావ్?" అని ప్రశ్నించేవాళ్ళు మధుసూదనరావింటికి రానే రారు! "నేను ఫలానాచోట ఒక మురికి కూపంలో కాలం గడుపుతున్నా" నని ఎవరికీ వనిమాలా చెప్పనూ చెప్పడు. ఏదో రేపుమీద అతనికి విశ్వాసం వుంది.

మధుసూదనరావు ఇంటికొచ్చి దగ్గరవేసివున్న తలుపులు తెరిచాడు. గదిలో అంధకారం. ఒక మూలనుంచి మూల్గులు. గబగబా లైటు వెలిగించి భార్యను సమీపించి 'ఏమి'టన్నాడు. "ఏం లేదంది" ఆమె! ఎక్కువగా అడిగి ఆమెను బాధించ దలచలేదు.

ఆ రాత్రంతా ఆమె మూలుగుతూనే వుంది. తెల్లవారిన వెనుక... ఆమె మరింత బాధపడసాగింది! మధుసూదనరావుకు అసలు విషయం తెలిసిపోయింది! తన భార్య ప్రసవసమయం సమీపించింది. ఏంచేయాలో తెలియక ఆచారి దగ్గరికి పరుగెత్తాడు. ఏదో సలహా యిచ్చాడు. ఆ సలహా ప్రకారంగా అయితే డబ్బు కావాలి! ఎలాగు? ఇవ్వాళ జీతాలిస్తారనే నమ్మకం వుంది. అందుకని తొమ్మిది గంటలకే వెళ్ళి అక్కడకూచున్నాడు—నిమిషాలు లెక్కపెట్టుకుంటూ!

పదిగంటలయింది. పదకొండయింది. ఇంకొంచెంసేపటికి జీతాలిస్తారనగా దురైస్వామి ఒక దుర్వార్తను...మధుసూదనరావుకుఅందజేశాడు! ఆ ఆఫీసునుంచి మధుసూదనరావుకు ఉద్వాసం చెప్పబడుతోంది. ఈ వర్తమానాన్ని వినటమే గాకుండా దానికి సంబంధించిన కాగితం సైతం అతనిచేతిలోకి వచ్చింది. విచారించాలో, సంతోషించాలో మధుసూదనరావుకు తెలీలేదు. వుద్యోగం వూడిపోయినందుకు విచారం. కాని ఒక నెల జీతం అదనంగా లభించటం ప్రస్తుత పరిస్థితులనుబట్టి సంతోషదాయకంగా కనిపించింది.

"ఇందుకు విచారించవద్దని" ఆచారి సలహాఇచ్చాడు. "నాకు చాలాసంతోషంగా వుం"దన్నాడుమధుసూదనరావు!

పన్నెండు గంటలకు రెండు నెలలజీతం తీసుకొని గబగబా బయటికొచ్చి ఆచారి సలహా ప్రకారం ఒక లేడీడాక్టర్‌ను తీసుకొని ఇంటిముఖంపట్టాడు !

మధుసూదనరావు ఇంటిముందు చాలా హడావిడిగా వుంది. ప్రక్క-ఇళ్ళ ఆడవాళ్ళు గుంపులుగుంపులుగా నిల్చొని వున్నారు. గబగబా లోని కెళ్ళి చూచేప్పటికి...తనభార్య ఒక పెద్ద నెత్తురుముద్దగా పడివున్నది. మధుసూదనరావు చిన్నపిల్లవాడికిమల్లే గావురుమన్నాడు ... లేడీ డాక్టర్‌తో ఎలాగయినా తన భార్యను బ్రతికించమని ప్రాధేయపడ్డాడు. కాని ఒక అరగంట క్రితమే ప్రసవ వేదనతో ఆమె బాధపడి ఈ లోకాన్ని వీడిన సంగతి అతని కింకా తెలీలేదు !

కథా నిలయం
శ్రీకాకుళం